క్లుప్తంగా

## హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక రేపు

కోట: రాష్ట్రస్థాయి జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టు ఎంపిక ఈ నెల 19వ తేదీ కోట ఎస్సీ గురుకుల పాఠశాల క్రీడామైదానంలో జరుగుతుందని హ్యాండ్‌బాల్ జిల్లా అసోసియేషన్ కార్యదర్శి, పీడీ శ్రీరేష్ శుక్రవారం తెలిపారు. అర్హత కలిగిన క్రీడాకారులు పూర్తి ఆధారాలతో హాజరు కావాలన్నారు. ఎంపిక చేసిన జట్టు మార్చి 3వ తేదీ నుంచి కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందన్నారు.

## సీపీఐ కార్యాలయంలో ప్రేమజంటకు వివాహం

గూడూరు: పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఓ ప్రేమ జంటకు వివాహం జరిగింది. తమ ప్రేమను నిరాకరించిన పెద్దలను ఎదురించి వివాహం చేసుకోవాలన్న ప్రేమ జంట సీపీఐ కార్యాలయానికి చేరుకుని పెళ్లి చేయాలని కోరింది. స్పందించిన నాయకులు పెద్దలను కాదని ఇలా చేయడం సరికాదని యువ జంటకు తొలుత సూచించారు. అనంతరం వారి తల్లిదండ్రులతో చర్చించి, వారిని ఒప్పించి వివాహం చేశారు.

## సులభరీతిలో బోధించాలి

సైదాపురం: ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా సులభరీతిలో విద్యాబోధన చేయాలని ఎంఈఓ దయాకర్ సూచించారు. మండలంలోని తిప్పిరెడ్డిపల్లెలోని ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎలా చదువుతున్నారన్న విషయంపై ఆరా తీశారు. మధ్యాహ్నభోజనం పథకాన్ని పరిశీలించారు.

## దుప్పట్లు పంపిణీ

గూడూరు: పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం గూడూరులో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. వెంట్రపాటి శ్రీధర్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యుల దాతృత్వంతో ప్రగతి సేవా సంస్థ వారు పట్టణంలోని పేదలకు అన్నదానం, దుప్పట్లను అందజేశారు. వెంట్రపాటి శ్రీలక్ష్మి, హారతి, సేవా సంస్థ నిర్వాహకులు చంద్రశేఖర్, శ్రీనివాసులు, సురేంద్రరెడ్డి, రామ్మోహనరావు పాల్గొన్నారు.

## ఎన్‌బీకేఆర్ లెక్చరర్‌కి డాక్టరేట్



లక్ష్మణరావును అభినందిస్తున్న విజయకుమార్‌రెడ్డి

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఐఎస్టీ సీఎస్‌ఈ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణరావుకు చెన్నైకి చెందిన సవీత డీమ్డ్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. డాక్టరేట్ అందుకున్న లక్ష్మణరావును శుక్రవారం కళాశాలలో విజయకుమార్‌రెడ్డి అభినందించారు. ఏరోబస్ట్ వెవలెట్ బేస్డ్ ఇమేజ్ వాటర్ మార్కింగ్ ఫర్ కాపీరైట్ ప్రొటెక్షన్ అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ లభించినట్లు తెలిపారు.

## మాజీ కౌన్సిలర్ కారు బోల్తా



వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): వెంకటగిరి-గూడూరు మార్గంలోని మన్నూరు వద్ద మలుపులో శుక్రవారం వెంకటగిరి పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ కారు అదుపుతప్పి బోల్తాపడింది. బాధితుని కథనం మేరకు.. వెంకటగిరి చెందిన ఒకటో వార్డు మాజీ కౌన్సిలర్ కె చెంగారావు శుక్రవారం తన కారును స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ నెల్లూరుకి బయలుదేరారు. మన్నూరు రోడ్డు మలుపు వద్దకు వచ్చే సరికే కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో కారులో ఉన్న చెంగారావు స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

## విద్యార్థులకు అవగాహన

చిల్లకూరు: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేసిన సచివాలయ వ్యవస్థపై ఉపాధ్యాయులు వరగలి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఏడో తరగతి సాంఘిక శాస్త్రంలోని పాఠ్యాంశంలో భాగంగా సచివాలయ సిబ్బంది ఎలాంటి విధులు నిర్వహిస్తారు, ఏ సేవలు అందుబాటులో ఉంటాయనే విషయాలపై వివరించారు. పాఠశాల హెచ్ఎం శివసుబ్రహ్మణ్యం, టీచర్లు కిషోర్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

## ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

వెంకటగిరి: జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసేలా లబ్ధిదారుల్లో చైతన్యం తీసుకురావాలని 23వ వార్డు కౌన్సిలర్ ఏ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆ వార్డు సచివాలయంలో శుక్రవారం సిబ్బంది, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం గృహనిర్మాణాలకు అందిస్తున్న సహకారాన్ని గురించి వివరించి, త్వరతగతిన నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## స్థలాల పరిశీలన

చిల్లకూరు: తూర్పుకనుపూరులోని పంచాయతీ స్థలాలను శుక్రవారం ఈఓపీఆర్‌డీ మాణిక్యం పరిశీలించారు. మార్చి 14 నుంచి గ్రామంలో ముత్యాలమ్మ జాతర నిర్వహించనున్నారు. ఈ క్రమంలో దుకాణాల ఏర్పాటుకు సంబంధించి పంచాయతీ స్థలాలను ఈఓపీఆర్‌డీ పరిశీలించి, ఎంతమేర వరకు దుకాణాలు ఏర్పాటు చేస్తారు. వీటి బాధ్యతను గతంలో ఎవరు నిర్వహించే వారు అన్న విషయాలపై సచివాలయ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# శివా..మముబ్రోవవా!

పాహిమాం పరమేశా.. అంటే చాలు కోరిన వరాలిచ్చి, కరుణించే భక్తవత్సలుడాయన.. అందుకే రాక్షసులు సైతం అప్పట్లో ఆది దేవుని కృపాకటాక్షాల కోసం తపస్సు చేశారు. అలాంటి బోళాశంకరుడిని భూలో మంతా జాగరణలతో కొలిచే పుణ్యదినం మహాశివరాత్రి. ఆ ఘడియలకు శైవక్షేత్రాలు సుందరంగా ముస్తాబయ్యాయి.

- మహాశివరాత్రికి శివాలయాల ముస్తాబు
- పలు దేవస్థానాల్లో ఉత్సవాలు ప్రారంభం



సైదాపురం: ముస్తాబైన కలిచేడులోని కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయం



చిల్లకూరు: ఏరూరులో విద్యుత్ దీపాల వెలుగులో శ్రీకాళహస్తీశ్వర స్వామి ఆలయం

గూడూరు: మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం గూడూరులోని భువనేశ్వరీదేవి సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయం రంగు రంగు విద్యుద్దీప కాంతులతో ముస్తాబు అయ్యింది. ఆలయంలో ఉత్సవాలకు అవసరమైన క్యూల ఏర్పాట్లు, భక్తులకు వసతితోపాటు భోజన సదుపాయం తదితర సౌకర్యాలను ఆలయ కమిటీ కల్పించింది.

**చిల్లకూరులో..**

చిల్లకూరు: మండలంలోని అన్ని శివాలయాలు మహాశివరాత్రికి ముస్తాబయ్యాయి. అన్ని ఆలయాలు విద్యుత్ దీపాలు వెలుగులో కనులకు విందు చేస్తున్నాయి. లింగవరంలోని వ్యాఘ్రేశ్వరస్వామి, ఏరూరులోని జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి, బల్లవోలులోని పరమేశ్వరస్వామి చేడిమాలలోని నాగలింగేశ్వరస్వామి, బూదనంలోని శివాలయంలో శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు.

**భీమేశ్వరస్వామి దేవస్థానంలో..**

కోట: గూడలికొండ శివరాత్రి వేడుకలకు ముస్తాబైంది. కొండపై ఉన్న పర్వతవర్ధిని సమేత భీమేశ్వరస్వామి దేవస్థానంలో శివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నారు. నేదురుమల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శివరాత్రి వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. మహాన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, అన్నదానం, గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కొండపైకి ఉచిత వాహన సౌకర్యం కల్పిస్తున్నట్లు గూడలి ఉపసర్పంచ్ పల్లెమల్లు విజయసారథిరెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ నాగలక్ష్మి తెలిపారు.

**ఓజిలిలో..**

ఓజిలి: మండలంలోని బట్లాకనుపూరు, నెమళ్లపుడి, ఓజిలి, ఇనుగుంట, తదితర గ్రామాల్లో శివాలయాలు మహాశివరాత్రికి ప్రత్యేకంగా ముస్తాబయ్యాయి. ఆలయాలను సుంధరంగా రంగులతో తీర్చిదిద్దారు. శివాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

**దొరవారిసత్రంలో..**

దొరవారిసత్రం: మండలంంలోని పలు గ్రామాల్లో ఉన్న శివాలయాలు ముస్తాబయ్యాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. శ్రీధనమల్లి, ఉచ్చూరు, కల్లూరు, దిగువమేలుపాక, వేణుంబాకం ,అక్కరపాక గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి.

**వెంకటగిరి మండలంలో..**

వెంకటగిరిరూరల్: మండలంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. పారవోలు గ్రామంలోని శివాలయం, వల్లివేడులో ఈశ్వరయ్యస్వామి, జంగాలపల్లెలోని వీరభద్రయ్యస్వామి, బాలాయపల్లి మండలంలోని సుబ్రహ్మణ్యం గ్రామంలో నిసుబ్రమణ్యేశ్వరస్వామి దేవస్థానం(శివాలయం), చిలమనూరులో శివాలయం శివరాత్రి వేడుకలకు ముస్తాబయ్యాయి. ఇప్పటికే నిర్వాహకులు విద్యుత్ దీపాలంకరణలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.

**సైదాపురంలో..**

సైదాపురం: మండలంలోని కలిచేడు, తురిమెర్ల, సైదాపురంలో ఉన్న శ్రీసర్వమంగళాదేవి ప్రసన్నేశ్వర స్వామి, శ్రీకామాక్షి సమేత శ్రీసిద్ధేశ్వరస్వామి, బ్రహ్మంగారి ఆలయం, బాల త్రిపుర సుందరీ దేవి ఆలయం, సైదాపురంలో శివాలయం, రాజరాజేశ్వరిఅమ్మవారి ఆలయం, కలిచేడులో కామాక్షిసమేత శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయాల్లో శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

**సంతానేశ్వరస్వామి ఆలయంలో..**

సూళ్లూరుపేట: మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు న్యూకాలనీ సమీపంలో కాళంగినదీ తీరంలో ఉన్న సంతానేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రికి ముస్తాబైంది. శనివారం మధ్యాహ్నం 12 గంటల వరకు స్వామివారికి కాళంగినదీ జలాభిషేకం జరుగుతుంది. కాళంగినది నుంచి ఆలయం వరకు ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేశారు. అలాగే నదిలోని ఇసుకతో సైకత లింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.

**నాయుడుపేటలో..**

నాయుడుపేటటౌన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజుల పాటు మహాశివరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నట్లు స్థానిక దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధి కారి శాంతరావు తెలిపారు. పట్టణంలోని అఖిలాండేశ్వరి దేవి సమేత జంబుకేశ్వరస్వామి ఆలయం, పుదూరు, విన్నమాల, తిమ్మాజికండ్రిగ, జువ్వలపాళెం, అన్నమేడు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు.

### శైవక్షేత్రాలు కళకళ



రాపూరు: మహాశివరాత్రి వేడుకల కోసం మండలంలోని శైవక్షేత్రాలైన ఈశ్వరబుగ్గేశ్వర ఆలయం, సిద్ధలేశ్వరకోన, మామిడికోన, రాపూరులోని రామనాథేశ్వరస్వామి ఆలయం, ముస్తాబయ్యాయి. శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, రుద్రాభిషేకాలు, శివపార్వతుల కల్యాణం, అన్నదానం తదితర కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.









ముస్తాబైన మూలస్థానేశ్వరస్వామి ఆలయం, దొరవారిసత్రం: విశేషాలంకరణలో ఆదిదేవుడు, కోట: ముస్తాబైన భీమేశ్వరస్వామి దేవస్థానం, సూళ్లూరుపేట: సంతానేశ్వరస్వామి ఆలయం

## చెంగాళమ్మసేవలో దేవదాయశాఖ అదనపు కమిషనర్



చెంగాళమ్మ ఆలయంలో చంద్రకుమార్

సూళ్లూరుపేట: పట్టణంలో చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని రాష్ట్ర దేవదాయ శాఖ అదనపు కమిషనర్ టీ చంద్రకుమార్ కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఆయనకు కార్యనిర్వహణాధికారి ఆళ్ల శ్రీనివాసులురెడ్డి ఆలయ పాలకమండలి సభ్యులు ఆయనకు స్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం పలికి, ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు ఎం చంద్రశేఖర్‌రెడ్డి, వంకా దినేష్‌కుమార్, ఓలేటి బాలసత్యనారాయణ, కర్లపూడి సురేష్‌బాబు, మన్నెముద్దు పద్మజ, బండి సునీత తదితరులు పాల్గొన్నారు.

## అంకితభావంతోనే రాణింపు



వల్లభదాస్‌ను సత్కరిస్తున్న ఎస్వీబీసీ చైర్మన్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర

వెంకటగిరి: ఉద్యోగులు అంకితభావంతో పనిచేస్తేనే రాణిస్తారని ఎస్వీబీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర తెలిపారు. స్థానిక ఆర్‌వీఎం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న వల్లభదాస్ ఇటీవల డివిజన్‌స్థాయిలో ఉత్తమ సేవా పతకం సాధించిన నేపథ్యంలో శుక్రవారం ఆ పాఠశాలలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌వీఎం ఉన్నత పాఠశాల కీర్తిప్రతిష్ఠలు పెంచేలా విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివకుమార్, ఉపాధ్యాయులు మధు, సుబ్రమణ్యం, ఎం కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.


## విద్యార్థులకు ఐదేళ్లుగా అల్పాహారం



విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్న ట్రస్టు నిర్వాహకులు,హెచ్ఎంలు

చిల్లకూరు: పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించేలా ప్రోత్సహించేందుకే ఐదేళ్లుగా సాయంత్రం పూట అల్పాహారం ఇస్తున్నామని రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని తిక్కవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండలంలోని 8 ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సాయంత్రం పూట అల్పాహారం అందించే కార్యక్రమాన్ని హెచ్ఎంల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు రాజనేని శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలోని 8 ఉన్నత పాఠశాలలో సుమారుగా 348 మందికి అల్పాహారం అందజేస్తామన్నారు. పదో తరగతి పరీక్షల్లో 600 మార్కులు సాధించిన మండలంలోని విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.లక్ష వంతున నగదు బహుమతి అందిస్తానని ప్రకటించారు. అనంతరం ట్రస్టు నిర్వాహకులను అన్ని పాఠశాలల హెచ్ఎంలు సత్కరించారు. ట్రస్టు ప్రతినిధులు శిరీష, బాబు పాల్గొన్నారు.

## ఎన్‌జీఓ మహిళా విభాగం నూతన కార్యవర్గం



మహిళావిభాగం నూతన కార్యవర్గ సభ్యులు

సూళ్లూరుపేట: ఏపీ ఎన్‌జీఓ సూళ్లూరుపేట తాలూకా శాఖ మహిళా విభాగం నూతన కార్యవర్గం ఎన్నిక శుక్రవారం ఏకగ్రీవమైంది. సూళ్లూరుపేట తాలూకా ఏపీ ఎన్‌జీఓ అధ్యక్షుడు సగుటూరు జనార్దనయ్య, కార్యదర్శి కే రవికుమార్ అధ్యక్షతన స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఎన్నికలు నిర్వహించారు. మహిళా విభాగానికి 11 మందితో కార్యవర్గం ఏర్పాటు చేశారు. మహిళా విభాగం అధ్యక్షురాలిగా టీ ప్రసన్న, ఉపాధ్యక్షులుగా బీ ప్రశాంతి, వీ నాగమణి, సంయుక్త కార్యదర్శులుగా ఎం రాజకుమారి, కే కవిత, ఎల్ కామేశ్వరి, ఎం విజయలక్ష్మి, ఉపకార్యదర్శులుగా కే మహిత, టీ కన్నెమ్మ, కోశాధికారిగా జే రమాదేవి, కోకన్వీనర్‌గా బీ మైథిలి ఎన్నికయ్యారు. మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు వీ చిన్నమ్మ, కే లక్ష్మీకాంతమ్మ ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. జీ సువర్ణ, ఈ కరుణమ్మ, జీ రమేష్ పాల్గొన్నారు.

## ఆక్రమణల తొలగింపు

చిల్లకూరు: రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 403 లో ఉన్న ఆక్రమణలను రెవెన్యూ అధికారులు శుక్రవారం తొలగించారు. వరగలి రహదారికి పక్కనే ఉన్న సర్వే నంబర్ 403లో ఉన్న గుంట పోరంబోకులో కొంత స్థలాన్ని చదును చేసి, ఆక్రమించుకుని వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తున్నారు. దీనిపై పలుమార్లు రెవెన్యూ అధికారులు స్థానికులు ఫిర్యాదులు చేసినప్పటికీ పట్టించుకోలేదు. అయితే ఇటీవల ఆక్రమణల జోరు పెరిగి మరికొంత భూమిని చదును చేయడంతో స్థానికులు మరోసారి ఫిర్యాదు చేశారు. దీంతో ఆక్రమణదారులను కార్యాలయానికి తహసీల్దార్ స్వర్ణను పిలిపించి స్థలాన్ని ఖాళీ చేయాలని ఆదేశించినా ఆక్రమణదారులు భేఖాతరు చేశారు. దీంతో తహసీల్దార్ ఆదేశాల మేరకు డీటీ శ్రీనివాసులు, ఆర్ఐ రమ్యస్వాతి ఆక్రమణలను తొలగించారు. అయితే ఆక్రమణదారులు రెవెన్యూ అధికారులతో వాగ్వివాదానికి దిగడంతో రెవెన్యూ అధికారులు పోలీసులు సాయం అడిగారు. దీంతో అక్కడకు పోలీసులు చేరుకుని ఆక్రమణలను తొలగించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. వీఆర్వోలు శ్రీనివాసులు, జగదీష్, ఉదయ్, బాలాజీ, ఏడుకొండలు పాల్గొన్నారు.

## ఘనంగా ధ్వజారోహణం



నాయుడుపేటటౌన్: పట్టణంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 21వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గూడూరు సుధీర్‌రెడ్డి తెలిపారు. 21వ తేదీ స్వామివారి నగరోత్సవంతో వేడుకలు ముగుస్తాయన్నారు.

## నాగేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పుట్టమట్టిని ఊరేగింపుగా తీసుకువస్తున్న నాగేశ్వరాలయ పాలకమండలి

సూళ్లూరుపేట: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న నాగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను ప్రారంభమయ్యాయి. ఆలయ చైర్మన్ చెన్నారెడ్డి సుబ్రమణ్యంరెడ్డి(స్వామిరెడ్డి)ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ ఉత్సవాలను గ్రామస్తుల సహకారం, పలువురు దాతల సాయంతో చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం చెంగాళమ్మ ఆలయం ఆవరణలోని నాగులపుట్ట వద్ద ప్రత్యేక పూజలు చేసి అక్కడి నుంచి పుట్టమట్టిని తీసుకుని వచ్చి, అంకురార్పణ చేశారు. తొలిరోజు కలశస్థాపన పూజ, నందీశ్వరుని చిత్రపటానికి ప్రత్యేకపూజలు చేసి, ధ్వజారోహణం వైభవంగా నిర్వహించారు. అనంతరం విఘ్నేశ్వరపూజలు చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు కే వెంకటేశ్వర్లు, ఓ చెంగమ్మ, జీ భువనేశ్వరి, ఆర్ సూర్యనారాయణ, బీ చంద్రశేఖర్, వీ తిరుపాలమ్మ, వేనాటి మునికృష్ణారెడ్డి, వాకాటి బాబురెడ్డి, కాపిరెడ్డి దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాయకులతో నేదురుమల్లి ఆత్మీయ సమావేశం



నేతలతో మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: మండల కేంద్రంలోని తన నివాసంలో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం వివిధ మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన నాయకులతో రామ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేకంగా చర్చించారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో అందరు సమష్టిగా పని చేసి మళ్లీ జగనన్నను సీఎంగా చేసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థిని గెలిపించుకునేందుకు అందరు సహకరించాలన్నారు.

## ఎంపీ గురుమూర్తికి అభినందనలు




ఎంపీకి అభినందనలు తెలుపుతున్న విద్యార్థి సంఘం నేతలు

సైదాపురం: తిరుపతి ఎంపీ ఎం.గురుమూర్తికి ఏఐఎస్ఎఫ్ సంఘం నాయకులతోపాటు కలిచేడు గ్రామస్తులు శుక్రవారం అభినందనలు తెలిపారు. ఎంపీ గురుమూర్తి ప్రత్యేక చొరవ చూపి కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న మైకా మైన్స్ ఉన్నత పాఠశాల ఆధునికీకరణకు ఉత్తర్వులు జారీ చేయించారు. ఈ నేపథ్యంలో వారు తిరుపతిలోని ఎంపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన్ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## నిధుల దుర్వినియోగంపై 20న విచారణ

చిల్లకూరు: మండలంలో నిధుల దుర్వినియోగంపై ఈ నెల 20వ తేదీన గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని మండల అధికారులకు శుక్రవారం ఆదేశాలు అందినట్లు తెలిసింది. చిల్లకూరు మండలంలో ముత్యాలపాడు, తిక్కవరం, చేడిమాల, తిప్పగుంటపాళెం, పున్నపువారిపాళెం తిమ్మనగారిపాళెం, ఓడూరు, ఎగువరాజుపాళెం తీపనూరు పంచాయతీల్లో మండల పరిషత్ నిధులు పక్కదారి పట్టించి, దుర్వినియోగం చేసినట్లు ఎంపీపీ వెంకటరమణమ్మ ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపి, నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించడంతో విచారణకు ఆయా పంచాయతీలకు చెందిన రికార్డులతో పాటుగా సంబంధిత అధికారులు విచారణకు హాజరు కావాలని ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.

## ట్రాక్టర్‌ను ఢీకొన్న ట్రాలీ లారీ



దెబ్బతిన్న లారీ

నాయుడుపేటటౌన్: పట్టణంలోని శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు వద్ద శుక్రవారం సాయంత్రం ధాన్యం లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్‌ను ట్రాలీ లారీ వేగంగా వచ్చి ఢీకొంది. పోలీసులు కథనం మేరకు.. పెళ్లకూరు మండలం పెరుమాళ్లపల్లె నుంచి ధాన్యం బస్తాలలోడ్‌తో ట్రాక్టర్ నాయుడుపేట మండలంలోని మర్లపల్లె సమీపంలో ఉన్న రైస్‌మిల్లుకు బయలు దేరింది. కృష్ణపట్నం పోర్టు నుంచి రైల్వేకోడూరు వెళుతున్న ట్రాలీ ర్యాలీ వేగంగా వచ్చి ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు వాహనాల డ్రైవర్లకు ఎటువంటి గాయాలు కాలేదు. అయితే లారీ క్యాబిన్ ముందు భాగం దెబ్బతింది. రహదారిపై రెండు వైపుల వాహనాలు ఆగిపోవడంతో ట్రాఫిక్ స్తంభించి పోయింది. ఎస్ఐ శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకుని, క్రేన్ సహాయంతో రహదారి మధ్యలో నిలబడి పోయిన లారీ, ట్రాక్టర్‌ను పక్కకు జరిపి ట్రాఫిక్ పునరుద్ధరించారు.